# సాక్షి ప్రకాశం

మంగళవారం । 6 । ఆగస్టు । 2024






**పెద్ద సైకోలు.. పొట్టకొడుతున్నారు..**

కూటమి నాయకులు అధికారంలోకి రాగానే చిరుద్యోగుల పొట్టకొడుతూ సైకోల్లా వ్యవహరిస్తున్నారని సీఐటీయూ నాయకులు విమర్శించారు.

- 8లో..



**క్విట్ కార్పొరేట్ ఉద్యమం**

రైతులు, వ్యవసాయ కూలీల శ్రమ దోపిడీ చేసే మోదీ విధానాలకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్ ఉద్యమం చేపడుతున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వెల్లడించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం 38/29

**వాతావరణం**

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### సీఎం సమావేశంలో పాల్గొన్న కలెక్టర్



సీఎం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు అర్బన్:** ముఖ్యమంత్రి సోమవారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, పథకాలు, క్షేత్రస్థాయిలో వాటి అమలు తదితర అంశాలపై కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం చేసారు. జిల్లాల వారీగా వివిధ అంశాలపై కలెక్టర్‌లతో సమీక్షించారు. దీని అనుసంధానంగా జిల్లా కేంద్రం నుంచి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్ఓ విశ్వేశ్వరరావు ఇతర శాఖల ఉన్నతాధికారులు ప్రకాశంభవనం నుంచి వీడియో సమావేశంలో పాల్గొన్నారు.

### 12న ఒంగోలులో జాబ్ మేళా

**ఒంగోలు టౌన్:** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, ఇంటర్మీడియెట్ విద్య బోర్డు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ శ్రీహర్షిణి డిగ్రీ కళాశాలలో హెచ్‌సీఎల్ టెక్–బీ ప్రోగ్రాంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి జె.రవితేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత సీఎట్ పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ నిర్వహిస్తారని వివరించారు. ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి హెచ్‌సీఎల్ నుంచి టెక్–బీలో చేరేందుకు ఆఫర్ లెటర్ ఇస్తారని తెలిపారు. ఒక ఏడాది పాటు శిక్షణలో మొదటి 3 నెలలు నెలకు రూ.10 వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తారన్నారు. శిక్షణ పూర్తయిన తరువాత ఏడాదికి రూ.1.70 లక్షలను వేతనం పొందవచ్చన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో సీఈసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో 75 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులు దీనికి అర్హులని, ఇంటర్మీడియెట్ అర్హతతోనే ఆగిపోకుండా ఉన్నత విద్యలో సహకారం అందించాలన్న ఉద్దేశంతో హెచ్‌సీఎల్ ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వివరించారు. మిగతా వివరాలకు 8125215216కు సంప్రదించాలని కోరారు.

### ఓపెన్ టెన్త్, ఇంటర్‌లలో అడ్మిషన్స్ పెంచాలి



సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర

**ఒంగోలు సెంట్రల్:** ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల అడ్మిషన్స్ పెంచేలా అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర అన్నారు. సమగ్ర శిక్ష కార్యాలయంలో సోమవారం ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్స్ కోఆర్డినేటర్లకు అడ్మిషన్స్‌పై ఒక రోజు సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా విద్యాశాఖాధికారి డీ సుభద్ర మాట్లాడుతూ 14 సంవత్సరాలు దాటిన వారు పదో తరగతిలో, పది పాస్ అయి ఒక సంవత్సరం ఖాళీగా ఉన్న వారు ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్స్ పొందవచ్చని చెప్పారు. అడ్మిషన్స్ సకాలంలో పూర్తి చేయాలని, ఓపెన్ స్కూల్‌లో విద్యను పూర్తి చేయటం వలన కలిగే ప్రయోజనాలు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏసీ కే శివ కుమార్, వై వెంకట రావు, ఆంజనేయులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### డీఎస్సీ ఉచిత కోచింగ్



జగన్నాథరావు

**ఒంగోలు సెంట్రల్:** ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు జిల్లాలోని గిరిజనులకు డీఎస్సీ ఉచిత కోచింగ్ ఇవ్వటానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆశాఖ జిల్లా సంక్షేమాధికారి జగన్నాథరావు వెల్లడించారు. జిల్లాలోని గిరిజనులు డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ, టెట్ పాసైన వారిని మెరిట్ ఆధారంగా డీఎస్సీ కోచింగ్‌కు అర్హులుగా ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు ఆసక్తి కల వారు దరఖాస్తుతో పాటు పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీఈడీ, ఇంటర్, డీఈడీ, టెట్ పాసైన ఉత్తీర్ణత సర్టిఫికెట్స్, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్ జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో దరఖాస్తును సమర్పించాలని కోరారు. ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

**కంభం హైస్కూల్లో పనిచేయని ఆర్వో ప్లాంటు**

కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 500 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమయంలో మినరల్ వాటర్‌కు బదులు బోరు నీళ్లు ఇస్తున్నారు. పాఠశాలలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్ కొన్ని రోజులుగా పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులకు బోరు నీరే దిక్కయింది. మధ్యాహ్న భోజనంలో కూడా నాణ్యత కొరవడింది. గుడ్లు సరిగ్గా ఉడకడం లేదని కొందరు విద్యార్థులు గుడ్లు తినకుండా వదిలేస్తున్నారు. అదేవిధంగా జమ్ములపాలెం జెడ్పీ హైస్కూల్‌లో మంచినీరు లేక ప్రైవేటు ఆర్వో ప్లాంట్ నుంచి మంచినీటి బబుల్స్‌ను విద్యార్థులు మోసుకొచ్చుకుంటున్నారు.



**వెజిటబుల్స్ లేని వెజ్ బిర్యానీ..**

ఒంగోలులోని పీవీఆర్ బాలుర హైస్కూల్లో సోమవారం వెజిటబుల్ బిర్యానీ, కుర్మా చేశారు. వెజిటబుల్స్ లేకుండా బిర్యానీ, నీళ్ల సాంబారును తలపించే కుర్మా చేసి పిల్లలకు వడ్డించారు. అదేవిధంగా దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెజిటబుల్ రైస్ లో ఒక్క టామాటాలు మాత్రమే వేసి వండారు..ఆ అన్నం కూడా తెల్ల అన్నం మాదిరిగానే ఉంది. పిల్లలు మాత్రం ఏం పెట్టినా చేసేందేం లేక అలాగే తింటున్నారు.



సంద్రాల సారూ..

# సర్కారు బడి గాడి తప్పి..



ప్రభుత్వ విద్యకు జగన్ సర్కార్ ప్రాధాన్యత ఇచ్చింది. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. అయితే అందరూ ఊహించినట్లే కూటమి ప్రభుత్వంలో సర్కార్ బడులు గాడి తప్పాయి. నాణ్యమైన చదువులు అటకెక్కుతున్నాయి. మౌలిక వసతులు కొరవడుతున్నాయి. సమస్యలతో ఈసురోమంటున్నాయి. విద్యార్థులకు అందించే ప్రోత్సాహాల ఊసేలేదు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత కొరవడింది. మొదటి నుంచి ప్రభుత్వ విద్యారంగం పురోగామిని వ్యతిరేకిస్తున్న కూటమి నేతలకు అధికారం రాగానే విద్యా వ్యవస్థను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇప్పటికీ ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందలేదు. పిల్లలను బడికి పంపించే తల్లులకు ఇచ్చే తల్లికి వందనంపై ఇంత వరకు స్పష్టత లేదు.



టంగుటూరు మండలం జమ్ములపాలెంలో ప్రైవేటు ఆర్వోప్లాంట్ నుంచి నీటి బబుల్స్ మోసుకెళ్తున్న విద్యార్థులు

- చదువుల కోవెలలో సమస్యల నడుమ పాఠాలు
- జిల్లాలో వెయ్యికిపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- రుచించని మధ్యాహ్న భోజనం
- ఇంటివద్ద నుంచే క్యారేజీలు
- పెండింగ్‌లోనే మధ్యాహ్న భోజన పథకం బిల్లులు
- ఆర్వో ప్లాంట్లు ఉన్నా తాగునీటికి తప్పని తిప్పలు
- పట్టణాల్లో, ఎయిడెడ్ పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు
- రోజుకో పాఠశాలకు పంపుతూ సర్దుబాటు చర్యలు

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** పేద పిల్లల చదువులు చతికిలబడి పోతున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల, గురుకుల, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత విద్యాబోధనపై పడుతోంది. డీఎస్సీకి సంబంధించి జిల్లాలో 647 పోస్టులు భర్తీ చేయాలని నిర్ణయం తీసుకోగా, ఇంకా డీఎస్సీలో పేర్కొనని పోస్టులు, ఇటీవల రిటైరైన పోస్టులు వెరసి వెయ్యికిపై ఉన్నట్లు ప్రాథమిక సమాచారం. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరిస్థితులను సోమవారం 'సాక్షి' బృందం పరిశీలించింది.

**సబ్జెక్టు టీచర్ల కొరత:**

స్కూల్ అసిస్టెంట్లు హెచ్‌ఎంలుగా, హెచ్‌ఎంలు ఎంఈవోలుగా, స్కూల్ అసిస్టెంట్లు హైస్కూలు ప్లస్ టీచర్లుగా పదోన్నతులు లేదా కాలేజీ బోధనకు అనుగుణంగా బదిలీ కావడంతో పాత పాఠశాలల్లో ఖాళీలు పెరిగిపోయాయి. వారికి పదోన్నతులు ఇచ్చినట్లే ఎస్‌జీటీలకు కూడా పదోన్నతులు కల్పించి ఉంటే కొంతమేర సబ్జెక్టు టీచర్ల కొరత తీరేది. ఉదాహరణకు ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రెండు తెలుగు, ఒక బయాలజీ, ఒక సంస్కృతం పోస్టు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం సంస్కృతంలో ఎవరూ చేరకపోతుండడంతో మిగిలిన మూడు పోస్టుల కొరతగా ఉన్నాయి. అదే విధంగా రాంనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడ ఇంగ్లిషు, బయాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే ఒంగోలు మండలం మొత్తం మీద 15 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు ప్రస్తుతం మిగులుగా ఉన్నారు. పట్టణాలు, నగరంలో మిగులు ఉపాధ్యాయులు ఉండడంతో పెద్దగా సమస్య ఉండడంలేదు. కానీ ఒక్క గిద్దలూరు నియోజకవర్గంలోనే 45 మంది ఎస్‌జీటీలు, 123 మంది సబ్జెక్టు టీచర్ల కొరతతో ఉన్న ఉపాధ్యాయులపైనే అదనంగా భారం వేస్తుండడంతో సబ్జెక్టుల బోధనలో వెనుకబడి పోతున్నారు.

**మధ్యాహ్న భోజనం ..**

| | |
|---|---|
| జిల్లాలో పాఠశాలలు: | 2,341 |
| విద్యార్థుల సంఖ్య: | 1,78,615 మంది |
| సోమవారం హాజరైన వారు: | 1,41,979 మంది |
| ఆహారం తీసుకున్న వారు: | 1,36,003 మంది |
| తీసుకోని వారు: | 5,976 మంది |
| గుడ్లు మాత్రమే తీసుకునేవారు: | 25 శాతం మంది |



కురిచేడు మండలంలో ఇంటి నుంచి తెచ్చుకున్న బాక్సులు తింటున్న విద్యార్థినులు



సింగరాయకొండ హైస్కూల్లో హెల్పర్లు రాకపోవడంతో భోజనం వడ్డిస్తున్న విద్యార్థులు

**కిట్లలో నిర్లక్ష్యం..**

విద్యార్థి కిట్లు మాత్రం ఇంకా పంపిణీ దశలోనే ఉన్నాయి. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలవుతున్నా కిట్ల పంపిణీలో నిర్లక్ష్యం కొనసాగుతోంది. వాస్తవానికి జిల్లాకు 1.93 లక్షల కిట్లు వచ్చాయి. వాటిని గత ఏడాది రోల్ ప్రకారం పాఠశాలలకు పంపించారు. అయితే ఎంతమంది చదువుకుంటే అంతమంది పిల్లలకు రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం కార్యక్రమం అమలు చేస్తామని గత ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు ప్రకటించడం, కూటమి ప్రభుత్వం నెగ్గడంతో పేదలు సైతం తమ బిడ్డలను ప్రైవేటు బాట పట్టించారు. దీంతో దాదాపు 15 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో తక్కువగా నమోదయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య 1,78,615. దీంతో 15 వేల కిట్లు వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉండిపోయాయి.

**ఆయాలు.. వాచ్‌మన్‌లకు జీతాల్లేవ్..**

ఇవి కాకుండా జిల్లాలోని 2347 పాఠశాలల్లో ఆయాలకు , 147 ఉన్నత పాఠశాలల్లోని వాచ్‌మన్‌లకు గత మార్చి నుంచి జీతాలు విడుదల చేయలేదు. ఒక్కొక్కరికి రూ.6 వేలు జీతనం ఇవ్వాల్సి ఉంది. మొత్తంగా 5 నెలలకు అంటే వీరికి రూ.7.50 కోట్లు జీతాలు విడుదల కావాల్సి ఉంది. ఇవి కాకుండా ఎండీఎం కుక్, హెల్పర్లకు కూడా జూన్, జూలై నెలలకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉండిపోయాయి. అధికారులు సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేస్తున్నా కార్మికుల ఖాతాలకు మాత్రం జమకాకపోవడంతో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి.

**బలవంతంగా 150 ఏజెన్సీల మార్పు**

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసే ఏజెన్సీలు బలవంతంగా మార్చాలనే ఒత్తిళ్లు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఎన్నడూ లేని విధంగా రాజకీయ ప్రాబల్యం చోటుచేసుకోవడంతో కుకింగ్ ఏజెన్సీలపై ఒత్తిడి పెరిగింది. ఇప్పటికే 150 మందికిపైగా ఏజెన్సీల స్థానంలో నూతనంగా ఏజెన్సీలను నియమించేసుకున్నారు. వీరికి దాదాపు రెండు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

**ఎయిడెడ్‌లో 151 మంది మిగులు:**

జిల్లాలోని ఎయిడెడ్ పాఠశాలల్లో 151 మంది ఉపాధ్యాయులు మిగులుగా తేలారు. వీరిని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట సర్దుబాటు చేస్తే ఉపాధ్యాయుల ఖాళీల సమస్య కొంతమేర సర్దుకుంటుంది. గత ప్రభుత్వంలో 1998, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులను మినిమం టైమ్ స్కేలు పద్ధతిలో విధుల్లోకి తీసుకోవడంతో కొంతమేర ఉపాధ్యాయుల సమస్యకు బ్రేక్‌పడింది. డీఎస్సీ పూర్తయ్యే వరకు ఈ సమస్య వేధిస్తూనే ఉంటుంది. గతంలో ఇటువంటి వాటిని అధిగమించేందుకు విద్యా వలంటీర్లను వినియోగించే వారు. కానీ ప్రస్తుతం ఆ విధానం కూడా అందుబాటులో లేకపోవడంతో బోధనపై ప్రభావం పడుతోంది. ఒంగోలు 30 మంది, నాగులుప్పలపాడు 15, మద్దిపాడు 1, దొనకొండ 5, దర్శి 1, కంభం 18, మార్కాపురం 9, వై.పాలెం 9, కొమరోలు 12, గిద్దలూరు 20, కనిగిరి 8, వెలిగండ్ల 5, హనుమంతునిపాడు 6, అర్ధవీడు 3, పుల్లలచెరువు 3, రాచర్లలో 5 మంది ఉపాధ్యాయులు ఎటువంటి బోధనకు అవకాశం లేక (విద్యార్థులు లేని కారణంగా) ఖాళీగా ఉంటున్నారు. వీరిని ప్రభుత్వ పాఠశాలల్లోకి శాశ్వత ప్రాతిపదికన సర్దుబాటు చేసే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా దృష్టిసారించడంలేదనే విమర్శలు వస్తున్నాయి. ఎక్కడైనా టీచర్ సెలవు పెడితే వీరిని డిప్యుటేషన్‌పై ఒకరోజు ఆ పాఠశాలకు వీరిలో కొంత మందిని పంపుతున్నారు తప్పించి వీరి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడంపై ఉపాధ్యాయ వర్గాలు భగ్గుమంటున్నాయి.



చిన్నసైజు కోడిగుడ్లు

**ఏకోపాధ్యాయ స్కూళ్లు - 265**



పామూరు కొత్తపల్లెలో 5 తరగతులకు ఒకే ఉపాధ్యాయుడు

| | | | |
|---|---|---|---|
| గిద్దలూరు | 34 | దర్శి | 48 |
| వైపాలెం | 24 | కొండపి | 52 |
| సంతనూతలపాడు | 15 | కనిగిరి | 91 |
| | | ఒంగోలు | 1 |

**రుచి తగ్గిన భోజనం**

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో రుచి తగ్గిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పటిదాకా పనిచేస్తున్న కార్మికులను బలవంతంగా రాజీనామా చేయాలంటూ చేస్తున్న ఒత్తిళ్లు.. రాజకీయ ప్రాబల్యం వెరసి మధ్యాహ్న భోజనంలో రుచి కాస్తా తగ్గింది. ఇటీవల కలెక్టర్ యరజర్ల, కందులూరు తదితర పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడు గుడ్ల పంపిణీ జరగడంలేదనే వాస్తవం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రస్తుతం గుడ్ల పంపిణీ ప్రారంభమైంది. ఇక కంభం మండలం, మేడంవారిపల్లి ఉన్నత పాఠశాలల్లో ఆర్‌వో ప్లాంట్లు పనిచేయకపోవడం, మరికొన్ని చోట్ల బోరు నీరే ఆర్‌వో ప్లాంట్లలో వినియోగిస్తుండడంతో విద్యార్థులు ఇంటి వద్ద నుంచే మంచి నీరు తెచ్చుకుంటున్నారు. నాణ్యత కొరవడడంతో చాలా మంది విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నట్టు కనిపించింది.

**తరగతి గదుల కొరతతో ఇక్కట్లు**



పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 850 మంది ఇంగ్లిష్ మీడియం, తెలుగు మీడియం విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు ఆయా మీడియంలలో సెక్షన్‌లవారీగా క్లాసులు నిర్వహించేందుకు తగినన్ని గదులు లేవు. ఉపాధ్యాయులు లేరు. దీంతో ఒక్కో గదిలో 60 మందికి పైగా విద్యార్థులు కూర్చోవాల్సి వస్తోంది. పాఠశాలకు మరికొన్ని గదుల నిర్మాణం చేపట్టి తరగతి గదుల కొరత తీర్చి, ఉపాధ్యాయులను ఏర్పాటుచేసి బోధన సక్రమంగా జరిగేలా చూడాలి. – గాయకవాడ సుహాసిని, పామూరు

**మధ్యాహ్న భోజన నాణ్యత లేదు**



మధ్యాహ్న భోజన పథకంలో ఏ పదార్థంలోనూ నాణ్యత లేదు. గతంలో పిల్లలు ఇంటి నుంచి బాక్సులు తీసుకెళ్లేవారు కాదు. ఇప్పుడు అన్నం, కూరలు సరిగ్గా లేవు. దీంతో ఇంటి దగ్గర నుంచే బాక్సులు తీసుకెళ్తున్నారు. వీటితో పాటు చిక్కీలు కూడా తాజావి కాకుండా నిల్వ ఉన్నవి ఇస్తున్నారు.

– దేవళ్ల కృష్ణ, కమ్మవారిపల్లి, పీసీపల్లి మండలం

## గ్రీవెన్స్‌లో 308 అర్జీలు



గ్రీవెన్స్‌లో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

**ఒంగోలు అర్బన్:** ప్రకాశం భవనంలో నిర్వహించిన మీకోసం గ్రీవెన్స్ కార్యక్రమంలో సోమవారం 308 అర్జీలు ప్రజల నుంచి అధికారులకు అందాయి. జిల్లా కలెక్టర్ సీఎం సమావేశం ఉండటంతో అమరావతి వెళ్లడంతో జిల్లా అధికారులు గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీల తాలూకు సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, మండల స్థాయి అధికారులతో గ్రీవెన్స్ అర్జీలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీనిలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు సునీల్, వరకుమార్, లోకేశ్వరరావు, ఝాన్సీలక్ష్మి, సువర్ణమ్మ, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- పెద్దదోర్నాల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన అన్నపురెడ్డి మనశ్వినిరెడ్డి గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తన తల్లిదండ్రులు ఇరువురు మరణించారని తనకు ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ అర్జీ అందజేసింది. కొత్తూరు ఎంపీయూపీ స్కూల్‌లో నాల్గవ తరగతి చదువుతున్నానని, తన తండ్రి గత ఏడాది గుండెపోటుతో మరణించగా మూడు నెలల వ్యవధిలో తల్లి అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకుని మరణించిందని, ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందచేయాలని కోరింది.
- ఒంగోలు నగరం మారుతినగర్‌కు చెందిన లక్ష్మీనారాయణమ్మ గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తాను నడవలేని పరిస్థితి ఉందని మూడు చక్రాల బండి ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేసింది. దీనికి సంబంధించి 2010లో వికలాంగురాలిగా గుర్తిస్తూ గుర్తింపు కార్డు ఇచ్చారని, వికలాంగుల పింఛన్ కూడా వస్తుందని తనకు మూడు చక్రాల బండి ఇప్పించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరింది.
- సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలేనికి చెందిన కోండ్రుఅజయ్‌బాబు అనే విద్యార్థి గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తనకు ప్రైవేటు కాలేజి నుంచి తన సర్టిఫికెట్లు ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. హర్షిణి డిగ్రీ కాలేజిలో మొదటి సంవత్సరం చదువుతున్నానని అయితే గత ఆరు నెలలుగా ఫిట్స్‌తో ఇబ్బంది పడుతున్నానని తెలిపాడు. అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో ప్రభుత్వ కాలేజీకి మారేందుకు సదరు కాలేజి యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని పరిశీలించి సర్టిఫికెట్లు, టీసీ ఇప్పించాలని కోరాడు.

## పంద్రాగస్టుకు చిన్నారుల వేషధారణ పోటీలు

**ఒంగోలు టౌన్:** 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 11వ తేదీ పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో వేషధారణ, డ్రాయింగ్, దేశభక్తి పాటల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకాశం బాలోత్సవం ప్రధాన కార్యదర్శి కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని సోమవారం ఎల్బీజీ భవనంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకాశం బాలోత్సవం, రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సంయుక్తంగా నిర్వహించే ఈ పోటీల్లో 5వ తరగతి, ఆలోపు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు.

ఈ పోటీల్లో నగరంలోని అన్నీ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోపు 9490300412, 9848605205 నంబర్లకు ఫోన్ ద్వారా కానీ వాట్సప్ ద్వారా కానీ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ ఒంగోలు సెంట్రల్ రీజినల్ చైర్మన్ బండారు లక్ష్మీ నారాయణ, జనవిజ్ఞాన వేదిక నగర అధ్యక్షుడు ఎస్‌వీ రంగారెడ్డి, కార్యక్రమ కన్వీనర్ నాయుడు మాల్యాద్రి, ప్రోగ్రాం సభ్యులు సీహెచ్ వినోద్ పాల్గొన్నారు.



వేషధారణ పోటీల కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### పొగాకు గరిష్ట ధర రూ.360



పొదిలిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న బేళ్లు

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలో సోమవారం పొగాకు గరిష్ట ధర కేజీ రూ.360 పలికిందని ఆర్ఎం లక్ష్మణరావు తెలిపారు. రీజియన్ పరిధిలోని 11 కేంద్రాల్లో 10,011 బేళ్లు వేలానికి రాగా 8,652 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. వ్యాపారులు వివిధ కారణాలతో 1,359 బేళ్లను తిరస్కరించారు.

### పోలీస్ గ్రీవెన్స్‌కు 73 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ(అడ్మిన్) నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై నిర్ణీత కాలపరిమితిలోగా చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్‌రావు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికకు 73 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఏఎస్పీలు సమస్యల పూర్వాపరాలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో మాట్లాడారు. బాధితులకు న్యాయం కలుగుతుందన్న భరోసా కలిగేలా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఒంగోలు దిశ స్టేషన్ సీఐ షేక్ ఖాజావలి, ఎస్సీ ఎస్టీ సెల్ సీఐ రమణ, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ పాల్గొన్నారు.

### అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై శ్రీనివాసరెడ్డి

దర్శి: అప్పుల బాధ తాళలేని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దర్శి మండలంలోని పోతవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మృతుడి భార్య బాల కుమారి కథనం మేరకు.. పదేళ్ల క్రితం నాగార్జున వివాహానంతరం ఐదు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిరప, పత్తి పంటలు వేశారు. నష్టం వాటిల్లడంతో భారీగా అప్పులయ్యాయి. ఇల్లు కట్టే సమయానికి రూ.10 లక్షలు అప్పు ఉండగా ఆ అప్పు తీర్చేందుకు మరో ఆరు లక్షలు ఫైనాన్స్‌లో తెచ్చుకున్నారు. ఆటో తెచ్చుకుని బాడుగలకు తిప్పుతున్నా కిస్తీలు కట్టలేని పరిస్థితి వచ్చింది. గత కొద్దిరోజులుగా మానసిక వేదనకు గురవుతున్న నాగార్జున సోమవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### ముగ్గురు బైక్ దొంగలు అరెస్టు

- నిందితుల నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో సీఐ, సిబ్బంది

గిద్దలూరు రూరల్: గిద్దలూరు, పరిసర ప్రాంతాల్లో బైక్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను గిద్దలూరు పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. గిద్దలూరు సీఐ వైవీ సోమయ్య తన కార్యాలయంలో నిందితుల వివరాలు వెల్లడించారు. కొంగలవీడు రోడ్డుకు చెందిన ఆవుల నవీన్‌కుమార్, ఆవుల రాజకృష్ణ, గొల్లపల్లె రంగప్రసాద్ చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. గిద్దలూరు పట్టణంలో వరుసగా బైక్ దొంగతనాలకు పాల్పడుతూ వాటిని విక్రయించి జల్సా చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరిని గిద్దలూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని చెప్పారు.

# పెద్ద సైకోలు.. పొట్ట కొడుతున్నారు

- కూటమి ప్రభుత్వం వచ్చీరాగానే చిరుద్యోగులను తీసేస్తున్నారు
- తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలి
- స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు అరికట్టాలి
- చలో అసెంబ్లీ, న్యాయపోరాటం చేస్తాం
- నియామకాల పేరుతో డబ్బులు దండుకునేందుకు టీడీపీ నేతల కుట్రలు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న చిరుద్యోగులు

ఒంగోలు టౌన్: గత ప్రభుత్వం మీద చీటికి మాటికీ సైకోలంటూ విమర్శలు చేసిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు అధికారంలోకి వచ్చీ రాగానే చిరుద్యోగుల పొట్టలు కొడుతూ పెద్ద సైకోల్లా ప్రవర్తిస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.కల్పన విమర్శించారు. మా ప్రభుత్వం వచ్చింది, మీరంతా ఉద్యోగాలు మానేయండి అంటూ ఎమ్మార్వో, ఎంఈఓల ద్వారా తెలుగుదేశం పార్టీ నాయకులు ఒత్తిడి చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం మంచి పద్ధతి కాదని ఆమె హెచ్చరించారు. ''మీకు చేతనైతే ఇసుక దొంగలు, భూ కబ్జాలు చేస్తున్న వారిమీద మీ ప్రతాపం చూపించాలి. రెండు వేలు, మూడు వేల రూపాయలకు ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలను పోషించుకునే నిరుపేదల కడుపుకొట్టడం దారుణం'' అంటూ ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న చిరుద్యోగులను తొలగిస్తున్న తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ.. ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, వీఓఏలు, అంగన్‌వాడీ హెల్పర్లలో చాలా మంది ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని, అలాంటి వారికి ఉద్యోగ భద్రత కల్పించాల్సిన ప్రభుత్వమే ఉద్యోగాలు తీసేసి ఇంటికి వెళ్లమంటే ఎలా అంటూ నిలదీశారు. ఈ కార్మికులందరికీ స్టాండింగ్ కమిటీ ఆర్డర్లు ఉన్నాయి, జీవోలు ఉన్నాయని, తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడానికి ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, ఇతరా ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక వర్గాలు కీలక పాత్ర పోషించారని, తీరా అధికారంలోకి వచ్చీరాగానే టీడీపీ ప్రభుత్వం ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోకుండా తొలిరోజు నుంచే వారిని వేధించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు మండిపడ్డారు. చిరుద్యోగుల స్థానంలో కొత్తవారిని నియమించి డబ్బులు దండుకునేందుకు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. 25 ఏళ్లుగా పనిచేస్తున్న స్కీం వర్కర్లను తొలగించి చిరుద్యోగుల పొట్టలు కొడుతున్నారని వాపోయారు. గ్రామ, మండల నాయకుల ఒత్తిడితో శాసన సభ్యులు అధికారులకు సిఫార్సు లేఖలు ఇవ్వడంతో వారి ఆగడాలు మితిమీరి పోయాయని విమర్శించారు. జిల్లాలోని అధికారులు కనీస నిబంధనలను పట్టించుకోకుండా 300 మంది వీఓఏలను, 375 మంది మధ్యాహ్న భోజన పథకం కార్మికులను, 50 మంది పాఠశాల స్వీపర్లను, 200 మంది ఫీల్డ్ అసిస్టెంట్లను, 100 మంది మున్సిపల్ కార్మికులను, 15 మంది స్వచ్ఛ భారత్ కార్మికులను, 25 మంది పంచాయతీ కార్మికులను తొలగించినట్లు తెలిపారు. ప్రభుత్వ జీవోలకు అనుగుణంగా అంగన్‌వాడీ హెల్పర్లకు ఇచ్చిన పదోన్నతులను సైతం నిలిపివేయడం దారుణమన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు జీవీ కొండారెడ్డి సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ ధర్నాతోనైనా ప్రభుత్వం దిగిరాకపోతే చలో అసెంబ్లీ చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు గంటెనపల్లి శ్రీనివాసులు అధ్యక్షత వహించిన ఈ ధర్నాలో పి.ఆంజనేయులు, డి.మహేష్, మాలకొండయ్య, సుబ్బమ్మ, ఆనంద్, తంబి శ్రీనివాసరావు, వి.మోజెస్ , బసవపున్నయ్య, టి.రాము పాల్గొన్నారు.

#### కుటుంబం నడిచేదెలా



నా భర్త అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. ఎలాంటి పని చేయలేని పరిస్థితిలో నేను మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తూ కుటుంబం నడుపుకుంటున్నాను. 23 సంవత్సరాలుగా దీని మీదే ఆధారపడి బతుకుతున్నాం. ఈ నెల 1వ తేదీ నుంచి నన్ను పనిలోంచి తీసేశారు. ఇప్పుడెలా బతకాలి. ఏ పనికి వెళ్లాలి. పనిలోంచి తీసేసినప్పటి నుంచి దిక్కుతోచక ఏడుస్తున్నాను. ఇది చాలా అన్యాయం. మీ బొజ్జలు నింపుకోడానికి మా పొట్టలు కొట్టడం దారుణం.

– తమ్మిశెట్టి బాలనాగమ్మ, రాయవరం

#### నా బాబును ఎలా సాకాలో అర్థం కావట్లేదు



మాది తర్లుపాడు మండలం చెన్నారెడ్డి పల్లి గ్రామం. ఏడేళ్లుగా వీఓఏగా పనిచేస్తున్నాను. నా భర్త డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. సొంత ఇల్లు లేదు. అద్దె ఇంటిలో జీవనం కొనసాగిస్తున్నాం. నాకు తెలుగుదేశం హయాంలోనే ఉద్యోగం వచ్చింది. ఇప్పుడు వాళ్లే నన్ను ఉద్యోగం తీసేసి మమ్మల్ని రోడ్డున పడేశారు. నాకు చిన్న బాబు ఉన్నాడు. ఇప్పుడు నా పిల్లాడిని ఎలా సాకాలో తెలియడం లేదు. ప్రభుత్వమే మా నోటికాడి కూడు తన్నేస్తే మేము ఎవరికి చెప్పుకోవాలి. ఇది చాలా దుర్మార్గం.

– పగడాల అంజనీదేవి, చెన్నారెడ్డి పల్లి

## మోదీ విధానాలకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్ ఉద్యమం



మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ఒంగోలు టౌన్: రైతులు, వ్యవసాయ కూలీల శ్రమను దోపిడీ చేసి కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న మోదీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన చేపట్టిన క్విట్ కార్పొరేట్ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. సోమవారం రైతు సమన్వయ సంఘాల జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 38, 39 ప్రకారం దేశ సంపదను విద్య, వైద్యం, ఉపాధి కల్పనకు వినియోగించాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా బడా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. నిరుపేదలు, మధ్య తరగతి ప్రజలు బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును కార్పొరేట్ శక్తులకు రుణం ఇచ్చేలా మోదీ సర్కార్ అవకాశం కల్పించడంపై అభ్యంతరాలు వస్తున్నాయన్నారు. కార్పొరేట్లు తీసుకున్న అప్పులను తీర్చలేమని చేతులెత్తేస్తే తాము తీరుస్తామంటూ మోదీ సర్కార్ అత్యుత్సాహం ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. 70 కోట్ల భారతీయుల సంపద కేవలం 21 మంది కోటీశ్వరుల చేతుల్లో ఉండటం దేశానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. క్విట్ ఇండియా ఉద్యమం స్ఫూర్తితో చేపట్టిన క్విట్ కార్పొరేట్ ఉద్యమంలో రైతులు, కార్మికులు, రైతు కూలీలు, మేధావులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రైతు నాయకులు వీరారెడ్డి, జుజ్జూరి జయంతిబాబు, బాలకోటయ్య, ఎంఎస్ సాయి, జి.శ్రీనివాసులు, పమిడి వెంకటరావు, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఎస్కే బాబు, పీవీఆర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## కంభంలో పూజారి నివాసంలో చోరీ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ అధికారి

కంభం: తాళం వేసిన ఇంట్లో దొంగలు పడి నగలు, ఇతర వస్తువులు అపహరించుకెళ్లిన సంఘటన ఆదివారం రాత్రి కంభంలో చోటుచేసుకుంది. బాధితుడు, పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఫ్లైఓవర్ సమీపంలోని ఓ నివాసంలో జి.రమణయ్య శర్మ పది నెలలుగా ఉంటున్నారు. లింగోజీపల్లి గ్రామంలోని గుడిలో పూజారిగా పనిచేస్తూ గత కొన్ని రోజులుగా అక్కడే ఉంటున్నారు. ఆదివారం రాత్రి సీసీ ఫుటేజీని తన ఫోన్ పరిశీలిస్తున్న సమయంలో ఒక్కసారిగా కెమెరాలు ఆగిపోయాయి. వెంటనే రమణయ్య తన బైక్‌పై నివాసానికి చేరుకున్నారు. ఇంటి బయట అలికిడి కావడంతో దొంగలు దోపిడీ చేసిన సొమ్ము, వస్తువులతో సహా పరారయ్యారు. బీరువాలో దాచి ఉంచిన రెండు ఉంగరాలు, తాళిబొట్టు, వెండి వస్తువులు, గ్యాస్ స్టవ్, మిక్సీతోపాటు సీసీ కెమెరా డీవీఆర్, హార్డ్‌డిస్క్‌లను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మార్కాపురం క్లూస్ టీమ్ అధికారి ఇబ్రహీం ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. కాగా, ఆరు నెలల క్రితం ఇదే గృహంలో దొంగలు పడి నగలు, వస్తువులు అపహరించారు.

## మినిస్టర్ లోకేష్.. నోరు మూగబోయిందా?




నిరసన తెలుపుతున్న ఏబీవీపీ బాధ్యులు, విద్యార్థులు

- యువగళంలో మాట్లాడిన నోరు జీవో 77 రద్దుపై స్పందించాలి
- అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ధర్నా

ఒంగోలు సెంట్రల్:

జీవో నంబర్ 77 రద్దు చేస్తానని యువ గళం సభలో చెప్పిన నారా లోకేష్ మంత్రి కాగానే ఆ విషయంపై నోరు మెదపడం లేదని అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) బాధ్యులు మండిపడ్డారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులకు వర్తింపజేస్తామని, జీవో నంబర్ 77ను రద్దు చేస్తామని అన్ని యువగళం సభల్లో మాట్లాడిన లోకేష్.. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా సరే ఆ అంశాలపై స్పష్టత ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. మరో వైపు కౌన్సెలింగ్ నిర్వహిస్తుండటంతో విద్యార్థులు ఏ కళాశాలల్లో చదవాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రతి విద్యార్థికి ఫీజురీయింబర్స్‌మెంట్ అందజేయాలని, అది విదార్థులకు భిక్ష కాదని హక్కు అని పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్ అంకిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు సుదర్శన్, అయ్యప్ప, గురునాథ్, తంగిళ్ల, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చెక్ బౌన్స్ కేసులో 6 నెలల జైలు

మార్కాపురం: చెక్ బౌన్సు కేసులో నిందితుడికి 6 నెలల జైలు శిక్ష విధిస్తూ కింది స్థాయి కోర్టు విధించిన తీర్పును ఖరారు చేస్తూ మార్కాపురం ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శుభవాణి సోమవారం తీర్పు చెప్పినట్లు న్యాయవాది పైడిమర్రి రామచంద్ర తెలిపారు. 2013 జనవరి 8న మార్కాపురం పట్టణానికి చెందిన పాముల సూర్యనారాయణకు త్రిపురాంతకానికి చెందిన రైల్వే ఉద్యోగి కె.జాన్ బ్రాక్ రూ.1.80 లక్షల నగదు ఇవ్వాల్సి ఉంది. ఇందుకుగాను బ్రాక్ చెక్ రాసిచ్చాడు. సూర్యనారాయణ సదరు చెక్కును బ్యాంకులో వేయగా బౌన్స్ కావడంతో బ్రాక్‌పై కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. విచారణ అనంతరం మార్కాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టు బ్రాక్‌కు 6 నెలల జైలు శిక్ష విధిస్తూ, రూ.1.85 లక్షలు ఫైన్ వేస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో బ్రాక్ కింద కోర్టు తీర్పును సవాలు చేస్తూ మార్కాపురంలోని ఆరో అదనపు జిల్లా కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. అయితే బ్రాక్ కోర్టు తీర్పు రోజున హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా పోలీసులు న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. సోమవారం తీర్పును ఖరారు చేసిన జడ్జి.. ఆరు నెలల జైలు శిక్షతోపాటు ఫైన్ కట్టకపోతే అదనంగా 3 నెలలు జైలు శిక్ష అమలు చేయాలని స్పష్టం చేశారు. ముద్దాయిని ఒంగోలులోని జిల్లా జైలుకు తరలించాలని జడ్జి ఆదేశించారు.

## సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకం

- దళిత మహాసభ, సంఘాల ఐక్యవేదిక
- వర్గీకరణ వ్యతిరేకిస్తూ సభ

ఒంగోలు సెంట్రల్:

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని దళిత మహాసభ, దళిత సంఘాల ఐక్యవేదిక, మాల సంఘాల ఐక్యవేదిక నాయకులు అన్నారు. అంబేడ్కర్ గ్రంథాలయంలో ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. దళిత ఉద్యమ నేత, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియన్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. జూలియన్, డాక్టర్ వెంగళరావు, కురుకుంట్ల వెంకటేశ్వర్లు, కొండమూరి ప్రకాశ్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమని దానిని దళిత సంఘాలు, మాల సంఘాలు, అంబేడ్కర్ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. పీఎం మోదీ పార్లమెంట్‌లో ఎమెండ్‌మెంట్ ఓడిపోతామని తెలిసి అక్కడ సాహసం చేయక సుప్రీం కోర్టు ద్వారా రాష్ట్రాలకు అధికారం ఇస్తూ తీర్పును మంజూరు చేయించారని ఆరోపించారు. మోదీ, ఆర్‌ఎస్ఎస్ కుట్రలను తిప్పికొట్టి ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌లను సుప్రీంకోర్టులోనే కాపాడుకుంటామని, అందుకోసం దేశ వ్యాప్త ఆందోళనకు వెనకాడబోమని హెచ్చరించారు. మాలలు ఎవరూ అసంతృప్తికి లోను కావద్దని న్యాయం మన వైపు ఉందని చెప్పారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే సాధిద్దామని అన్నారు. గిరిజన ఐక్యసంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుబ్బారావు, పలు సంఘాల నాయకులు డాక్టర్ చప్పిడి ప్రియతం, మేరుగ రమేష్, బత్తుల రమణయ్య పాల్గొన్నారు.

## అద్దెకని వచ్చి.. సొమ్ము అపహరించి..

ఒంగోలు టౌన్: ఓ దుండగుడు జడ్జి కారు డ్రైవర్‌ను, అద్దెకు గది కావాలంటూ వృద్ధురాలి ఎదుట నటించాడు. చోరీకి రెక్కీ చేసి వెళ్లాడు. పక్కా ప్లాన్ ప్రకారం మరుసటి రోజు వచ్చి ఆమెపై దాడి చేసి బంగారం చైనుతో ఉడాయించాడు. నగరం నడిబొడ్డున జరిగిన ఈ సంఘటన సంచలనం సృష్టించింది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి. నగరంలోని అంకమ్మపాలెంలో ఏటి పంజుల సుగుణ అనే 60 ఏళ్ల వృద్ధురాలు కూతురితో కలిసి నివసిస్తున్నారు. ఇంటికి సమీపంలోనే ఆమెకు మరో సొంత ఇల్లు ఉంది. ఆ ఇంటి కింది పోర్షన్‌ను అద్దెకు ఇచ్చారు. పైన రేకుల గది ఖాళీగా ఉండటంతో టులెట్ బోర్డు పెట్టారు. దానిపై ఉన్న ఫోన్ నెంబర్‌కు శనివారం ఒక వ్యక్తి ఫోన్ చేసి గది అద్దెకు కావాలని అడిగాడు. నేరుగా ఆ ఇంటికి వచ్చి పొదిలి మండలానికి చెందిన తాను జడ్జి వద్ద కారు డ్రైవర్‌గా పనిచేస్తుంటానని నమ్మబలికాడు. గది నచ్చిందని చెప్పి రేపు వచ్చి అడ్వాన్స్ ఇస్తానని వెళ్లాడు. చెప్పినట్టే మరుసటి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు జనసంచారం తక్కువగా ఉండే సమయం చూసుకొని వచ్చాడు. వృద్ధురాలు గది తాళాలు తీస్తుండగా వెంట తెచ్చుకున్న పదునైన ఆయుధంతో తల వెనక భాగంలో కొట్టాడు. ఆమె మెడలో ఉన్న 9 సవర్ల బంగారు చైను లాక్కున్నాడు. చేతిలో ఉన్న కీ ప్యాడ్‌ను కూడా తీసుకున్నాడు. స్పృహ కోల్పోయి రక్తపు మడుగులో పడి ఉన్న సుగుణమ్మను గది లోపలకి ఈడ్చి పడేసి బయట గడియపెట్టి పారిపోయాడు. కిటికీలో గుండా తప్పించుకుని బయటపడిన ఆమె కూతురు లక్ష్మి, అల్లుడు సురేష్‌తో కలిసి సోమవారం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## గురుకులంలో చపాతీ బాగా కాలింది

- విద్యార్థులు చపాతీలు చేయడంలో తప్పు లేదన్న వైపాలెం టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు
- ఆ వీడియో బయటికెలా వెళ్లిందంటూ మీడియాపై చిందులు తొక్కిన ఎరిక్షన్‌బాబు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఆరోపణ



ఎరిక్షన్‌బాబు

యర్రగొండపాలెం: గురుకుల పాఠశాలలో విద్యార్థులు చపాతీ చేయడం పెద్ద విశేషం కాదని.. అందుకు సంబంధించిన వీడియో బయటికి వెళ్లడమే పెద్ద విషయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయంలో విద్యార్థులతో చపాతీలు చేయించడం, వంట పనుల్లో వారిని ఉపయోగించడంపై సోమవారం పత్రికలతోపాటు మీడియాల్లో కథనాలు వెలువడిన నేపథ్యంలో ఆయన తన అనుచరులతో ఆ విద్యాలయానికి వెళ్లి తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం తనకు అనుకూలమైన ఎరిక్షన్‌బాబు మీడియాతో మాట్లాడుతూ పిల్లలేదో చపాతీలు, వంట చేస్తున్నట్టు అసత్య మీడియాలో వచ్చిన వార్త నిజమా కాదా అని పరిశీలించేందుకు తాను పాఠశాలకు వచ్చానన్నారు. పాఠశాలలో చిన్న తరగతి పిల్లలు ఆకలితో ఉన్నారని, ఇతర తరగతి పిల్లలు చిన్నపాటి సహాయం చేస్తే దానిని భూతద్దంలో చూపించి, ఇక్కడ ఉన్న వార్డెన్‌ను, ప్రిన్సిపాల్‌ను అప్రతిష్ట పాల్జేయాలనే దురుద్దేశంతో చేసిన కార్యక్రమమని అన్నారు. కేవలం ఒక విలేకరికి, వార్డెన్‌కు మధ్య ఉన్న విభేదాల వల్లే అభూతకల్పన చేసి మీడియాలో ఎక్స్‌పోజ్ చేశారన్నారు. యర్రగొండపాలెంలో అబద్ధపు అసత్య ప్రచారం ఎక్కువగా జరుగుతోందని చెప్పిన ఆయన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పై విరుచుకుపడ్డారు. మీరు చపాతీలు చేస్తుండండి మేము వస్తామని మీడియా వాళ్లు ముందుగా ప్లాన్ చేసి ఉంటారని ఎరిక్షన్‌బాబు పాఠశాల సిబ్బంది ఎదుట తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

## చపాతీ మేకర్ అందిస్తాం

- 'పిల్లలతో చపాతీ తయారీ' బాధ్యులకు మెమోలు
- ఐటీడీఏ పీఓ రవీంద్రరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రవీంద్రరెడ్డి

యర్రగొండపాలెం: గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయానికి చపాతీల తయారీ యంత్రం అందిస్తామని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి.రవీంద్రరెడ్డి పేర్కొన్నారు. గురుకుల విద్యాలయంలో పిల్లలతో చపాతీలు చేయించడం , వంట పనుల్లో ఉపయోగించుకోవడంపై పత్రికలు, ఇతర సామాజిక మాధ్యమాల్లో కథనాలు రావంతో సోమవారం ఆయన విద్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పిల్లలు కేవలం చదువుకోవడానికే ఇక్కడికి వస్తారని, వారితో ఎటువంటి పనులు చేయించరని, చపాతీలు చేయడానికి స్వచ్ఛందంగా వెళ్లారని చెప్పారు. అయినప్పటికీ వార్డెన్, ప్రిన్సిపాళ్లకు మెమో జారీ చేస్తున్నామని, వారి సమాధానాన్ని బట్టి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. ముందుగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. భోజనాలు సక్రమంగా ఉండటంలేదని, ఇతర పనులకు తమకు ఉపయోగిస్తున్నారని విద్యార్థులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం చేపట్టే క్లీన్ అండ్ గ్రీన్ లాంటి పనులను మినహాయించి ఇతర పనులకు పిల్లలను వాడుకోవద్దని, ఆ విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సిబ్బందిని హెచ్చరించారు.

## ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు సెంట్రల్: 2024–25 విద్యా సంవత్సరంలో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్ఎంఎంఎస్)కు జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా ప్రజాపరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్, ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని చెప్పారు. విద్యార్థుల కటుంబ ఆదాయం రూ.3.5 లక్షలలోపు ఉండాలని, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 రుసుం చెల్లించి ఈ నెల 6వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. పరీక్ష రుసుం ఆన్‌లైన్‌లో పేర్కొన్న ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు.